క్లుప్తంగా

వైద్యులపై దాడులు అమానుషం

ఖమ్మంవైద్యవిభాగం: విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడులు చేయడం అనైతికమని, చిన్న పిల్లల వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ ఏలూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లును పరామర్శించి మాట్లాడారు. యువతి మృతి సంఘటనలోవైద్యుల తప్పిదం లేకపోయినా కొన్ని సంఘటనల్లో వారిపై రోగి బంధువులు దాడికి పాల్పడుతున్నారని ఇది సరియైనది కాదన్నారు. సూపరింటెండెంట్‌ను పరామర్శించిన వారిలో డాక్టర్ దేవేందర్, డాక్టర్ మేఘమణి, డాక్టర్ వంశీధర్, రాకేష్, రమేష్ తదితరులున్నారు.

'కందాల' పరామర్శ

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన నెల్లూరి సీతరామయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం రూ.10వేల ఆర్థిక సాయమందించారు. అదే విధంగా గ్రామానికి చెందిన షేక్ సకీనా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆలీ, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వీరభద్రం పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో వరి నాటడం ఉత్తమం

ఖమ్మంరూరల్: యాసంగిలో డ్రమ్ సీడర్ విధానంతో వరి నాటడం ఎంతో ఉత్తమమని, దీంతో రైతులకు ఎకరాకు రూ.5వేలు వరకు ఆదా అవుతుందని ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని గోళ్లపాడులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వెదజల్లే పద్ధతిలో వరి విత్తుకోవడం ద్వారా దాదాపు నెల రోజుల ముందే పంట కోతకు వస్తుందని, వెదజల్లిన మూడు రోజుల లోపు కలుపుమందు చల్లుకోవాలని సూచించారు. ఎరువులను కూడా అధిక మోతాదులో కాకుండా క్రమక్రమంగా పంట ఎదుగుదలను బట్టి వేసుకోవాలని, అధికంగా పరుగు మందులు కూడా వాడరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూ తగాదాలో హత్యాయత్నం

నేలకొండపల్లి: భూ పంచాయితీకి సంబంధించిన ఘటనలో హత్యాయత్నం జరిగింది. మండలంలోని బైరవునిపల్లికి చెందిన పర్వత రామారావు ఈనెల 11న చెరువుమాధారం వెళ్తుండగా, అదేగ్రామానికి చెందిన సైదులు పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని కత్తితో దాడి చేశాడు. ఇరువురి మధ్య భూపంచాయితీ కోర్టులో కొనసాగుతుండగా, ఆయన హత్య చేసేందుకు యత్నించాడని రామారావు చేసిన ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని అగ్రహారం కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఆకుతోట సైదులు ఈనెల 10న మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో బయటకు వెళ్లి వచ్చాడు. ఇంతలోనే తాళం పగలుగొట్టి ఉండగా, బీరువాలో దాచిన రూ.38 వేల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ జరిగాయి. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మాన్వికి చోటు



ప్రసంసాపత్రం అందుకుంటున్న మాన్వి

ఖమ్మం అర్బన్: నగరంలోని మమత డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అనితరావు దంపతుల కుమార్తె జి.మాన్వి శాస్త్రీయ జానపద సంగీత నృత్యోత్సవాలలో ప్రతిభ చాటి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విజయమాధవి సేవాసంస్కృతి అకాడమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సంగీత నృత్యోత్సవాల్లో పాల్గొని ప్రతిభ చాటి మెడల్, ప్రసంశాపత్రం అందుకుంది. మాన్వి నగరంలోని సర్వజ్ఞ నెక్స్టెజెన్ పాఠశాలలో చదువుతోంది. ఈమేరకు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి
వినోద	వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	వీరసింహారెడ్డి
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	వాల్తేరు వీరయ్య

- ఖమ్మంవ్యవసాయం



దూడూ బసవన్న సందడి



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఇంట్లో సకినాలు చేస్తూ..

సందడి తెచ్చిన సంక్రాంతి..!

మొదలైన పండుగ జోష్..
- జోరుగా రంగుల కొనుగోళ్లు
- మోడల్‌ను బట్టి పంతంగుల ధరలు
- బోగి పండ్లు, నవ ధాన్యాలు, అలంకరణ వస్తువులకు పెరిగిన డిమాండ్
- విక్రయాలతో మార్కెట్లు బిజీబిజీ



కమాన్ బజార్‌లో పతంగుల విక్రయాలు



రేగి పండ్లు కొనుగోలు చేస్తూ..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. మూడు రోజుల పాటు జరుపుకునే ఈ సంబరాలకు ఆలయాలు, ఇళ్లల్లో అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఈ పండుగ ప్రత్యేకమే. మహిళలకు సంక్రాంతి ముగ్గుల పండుగ కాగా, పిల్లలకు, యువతకు పతంగుల పండుగ, రైతులకు పాడి పంటల పండుగ. ఈ పండుగను సంబరంగా జరుపుకునేందుకు అవసరమైన వాటిని కొనుగోలు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇళ్ల లోగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. అందుకోసం మార్కెట్‌లో రంగులతో పాటు చమ్కీలతో ఉన్న రంగులు విక్రయిస్తున్నారు. ఇళ్లను కొంగొత్తగా తీర్చిదిద్దుకునేందుకు బొమ్మల కొలువులు, అలంకరణల వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

జోరుగా విక్రయాలు..
బోగి పండగ రోజున చిన్న పిల్లలపై బోగి పండ్లు పోసి ఆశీర్వదించడం ఆనవాయితీగా వస్తోంది. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యం, ఆయుష్షు పెరుగుతుందని ఓ నమ్మకం. బోగి పండ్ల(రేగి పండ్లు) విక్రయాలు మార్కెట్‌లో సాగుతుండడంతో మార్కెట్‌లో వీటికి గిరాకీ పెరిగింది. ఇక ముగ్గుల్లో పెట్టే గొబ్బెమ్మల్లో కూరగాయలతో పాటు గరిక, నవ ధాన్యాలు వేయటం ఆనవాయితీగా వస్తుండడంతో నవ ధాన్యాలను ప్యాకెట్లుగా చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

మోడల్‌ను బట్టి ధరలు..
చిన్న పిల్లలు మొదలు యువత, పెద్దల వరకు పతంగులు ఎగురవేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. భిన్నమైన పేర్లతో ఆకర్షణీయమైన డిజైన్లతో పతంగులను మార్కెట్లో విక్రయిస్తున్నారు. పతంగి మోడల్‌ను బట్టి రూ. 20 నుంచి రూ.600ల వరకు కూడా ధరలు పలుకుతున్నాయి. విమానాలు, రాకెట్‌లు, సీతాకోక చిలుకలు, సినిమా పేర్లు, హీరోలతో ఉన్న పతంగులు మార్కెట్‌లో ఎక్కువగా విక్రయిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఉండటంతో పిల్లలు గాలి పటాలను ఎగుర వేసే సంబరాల్లో మునిగి తేలుతున్నారు.

పతంగి ఎగరేద్దామిలా..



పతంగి ఎగురవేస్తున్న చిన్నారి

నేలకొండపల్లి: సంక్రాంతి పండుగ నాడు చిన్న పెద్ద అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేయడం ఆనవాయితీ. ముఖ్యంగా చిన్నారులు, కుర్రకారుల్లో ఆ జోషే వేరు. పతంగులు నింగిలో ఎగురుతుంటే పిల్లలు కేరింతలు హోరెత్తుతాయి. పతంగులు కొత్త పుంతలు తొక్కే క్రమంలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. చైనా మాంజా పతంగులతో చాలా ప్రమాదకరం. వీటి వలన పక్షులు చనిపోయే ప్రమాదం ఉందని, ఆలా జరిగితే జైలు శిక్ష, జరిమానా ఉంటుందని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయం దారాన్ని మాత్రమే వాడాలని సూచించారు. పండుగ వేళ విషాదాలకు చోటు లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తే పండుగ ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..
- శిథిలమైన, నిర్మాణంలో ఉన్న భవనాలు, గోడలులేని డాబాలు, నీటి ట్యాంకులపై ఎక్కి పతంగులు ఎగురవేయకూడదు.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగల వద్ద గాలిపటాలను ఎగురవేరాదు.
- విద్యుత్ వైర్లు మీద పడిన గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించొద్దు.
- మెటాలిక్ దారాలను వినియోగించడం వల్ల విద్యుత్ ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది.
- రోడ్ల వెంబడి దారం వేలాడుతూ కనిపిస్తే తీసేయాలి. లేకుంటే ప్రమాదాలు జరగొచ్చు.
- అత్యవరసర పరిస్థితుల్లో స్థానిక విద్యుత్ కార్యాలయం, టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇచ్చి విద్యుత్ సిబ్బందిని అప్రమతం చేయాలి.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కేజీబీవీ సిబ్బంది, వర్కర్లు



ధర్నా నిర్వహిస్తున్న బోదకాలు బాధితులు

కలెక్టరేట్ ఎదుట కార్మికులు..
ఖమ్మంమయూరిసెంటర్: కేజీబీవీ యూఆర్‌ఎస్‌లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్, వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల కస్తూర్బా గాంధీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ యూఆర్‌ఎస్ వర్కర్లతో వెట్టి చాకిరి చేయిస్తూ.. కనీస వేతనం కూడా ఇవ్వడంలేదన్నారు. కనీస వేతనం కింద రూ.18,000 ఇవ్వాలని, ప్రతి కేజీబీవీకి అదనంగా ఐదుగురు వర్కర్లను నియమించాలని, వర్కర్లు ప్రమాదంలో మృతి చెందితే రూ.10లక్షల పరిహారం ప్రకటించాలని కోరారు. అనంతరం జిల్లా అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల అశోక్, మధుర, రాధమ్మ, తార, అనసూయ, జ్యోతి, నాగలక్ష్మి, కృష్ణవేణి, కల్పన, అనూష, స్నేహలత, చంద్రకళ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బాధితులు..
తిరుమలాయపాలెం: బోదకాలు వ్యాధిగ్రస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకుడు తిమ్మిడి హన్మంతరావు మాట్లాడుతూ.. బోధకాలు బాధితులను దివ్యాంగులుగా గుర్తించి నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాలతో పాటు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఉచితంగా మెడికల్ కిట్లు అందించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వెన్నెబోయిన శ్రీనివాసరావు, పేర్ల భిక్షం, నాయీబ్రహ్మణ మండల నాయకులు ఆలేటి రంగయ్య, సామ ఇందిరమ్మ, బూబమ్మ, లింగమ్మ, వెంకటమ్మ, పార్వతమ్మ, కోటయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన న్యాయవాదుల దీక్ష



జెడ్పీ సెంటర్‌లో నాయకుల నిరసన

ఖమ్మంలీగల్/ ఖమ్మం మామిళ్లగూడెం: నగరానికి చెందిన న్యాయవాద దంపతులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు పలు సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించి దీక్షలో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గం ఈ దీక్షల్లో పాల్గొనగా.. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, ప్రజాసంఘాలు, బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం జెడ్పీ సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. నిందితులను అరెస్ట్ చేయాలని, టూటౌన్ సీఐని బదిలీ చేయాలని, ఏసీపీ నుంచి విచారణ అధికారిగా ఐపీఎస్ అధికారిని నియమించాలని చేసిన తీర్మానం మేరకు బార్ అధ్యక్షులు ప్రధానికి, భారత ఉన్నత న్యాయమూర్తి, బార్ కౌన్సిల్ ఇండియా, తెలంగాణ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, స్థానిక మంత్రికి, డీఐజీ ఆఫ్ పోలీస్ వరంగల్, డీజీపీకి లేఖ పంపినట్లు తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు, నాయకులు పెరుగువెంకటరమణ, పద్మాచారి, లిక్కి కృష్ణారావు, భద్రూనాయక్, దామళ్ల సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, రెహమాన్, మద్రి ప్రకాష్, వెంకటేశ్వరరావు, రాంబాబు, వీరన్న, తౌఫిక్, రాము తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బీరోలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరానికి చెందినపదో తరగతి విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు వెంకటప్పారావు, ఉపాధ్యాయులు ప్రసాద్, హుస్సేన్, సువర్ణప్రసాద్, నాగలక్ష్మి, కృష్ణ, పద్మావతి, అంజలిదేవి, విజయ్‌కృష్ణ, శంకర్‌రెడ్డి, లక్ష్మికుమారి, శర్మ పాల్గొన్నారు.

పాలేరులోని క్రాంతి విద్యా మందిర్‌లో..
కూసుమంచి: పాలేరులోని క్రాంతి విద్యా మందిర్‌లో పదో తరగతి(2006–07 బ్యాచ్) చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్నేహితులతో సరదాగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ సాయిని వెంకన్నతో పాటు ఇతర గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేష్, అనిల్, సందీప్, మహేష్, నాగరాజు, రవి, కవిత, ప్రసన్న, శృతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

'బొమ్మ'లో ఫ్రెషర్స్ డే..

ఖమ్మంఅర్బన్: నగరంలోని బొమ్మ విద్యా సంస్థల ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వారి లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగుతూ విజయ తీరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దీనికోసం యాజమాన్యం నుంచి అన్ని రకాల ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొమ్మ సత్య ప్రసాద్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖమ్మం సభతో సత్తా చాటాలి



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాజేశ్వరరెడ్డి తదితరులు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

కూసుమంచి: కరీంనగర్‌లో 2001లో నిర్వహించిన సింహగర్జన సభతో తెలంగాణ ఉద్యమ సత్తా ఎలా చాటామో ఈనెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ సభతో దేశానికి సత్తా చూపాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. కూసుమంచిలో శుక్రవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యాన ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు పాల్గొనే ఈ సభకు పాలేరు నుంచి అత్యధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు కర్ణాటకలో కూడా అమలుచేయాలని బీజేపీ ఎమ్మెల్యే కోరడం కేసీఆర్ దార్శనికతకు నిదర్శమని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పథకాలను కాపీ కొడుతున్నా సరిగ్గా అమలు చేయలేని పరిస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. పాలేరు ప్రజలు నిజంగా అదృష్టవంతులని, రాష్ట్రంలో ఎక్కడా లేనట్లుగా కృష్ణా, గోదావరి జలాలు ఇక్కడ పారుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ సభకు పాలేరు నియోజకవర్గం నుంచి 50వేల మందిని తరలించాలన్నారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గం నుంచి అత్యధికంగా కార్యకర్తలను తరలిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో జనగామ, ములుగు జెడ్పీ చైర్మన్లు సంపత్‌రెడ్డి, జగదీష్, నాయకులు, ప్రజాప్రతినిధులు రాంబాబుయాదవ్, రమేష్‌రెడ్డి, ఇంటూరి బేబి, వరప్రసాద్, బానోత్ శ్రీనివాస్‌నాయక్, బెల్లం ఉమ, వజ్జా రమ్య, బోడ మంగీలాల్, వేముల వీరయ్య, బెల్లం వేణు, వీరన్న, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్, సరెండర్ లీవుల బిల్లులను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, ఆర్.రంగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును ఖమ్మంలో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసిన సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్ బిల్లులతో పాటు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలు 2014లో ముంపు ఉపాధ్యాయులకు వేతనాలు రెండు చోట్ల జమ చేశాయని, వీరికి వాయిదాల పద్ధతిన వేతనాలు మినహాయించాలని మంత్రిని కోరారు.

మంత్రిని కలిసిన టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు
రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో మంత్రిని కలిసి ఫలములు అందజేశారు.

ఎంపీ నామకు కృతజ్ఞతలు



సన్మానిస్తున్న మాదిగ హక్కుల దండోరా నేతలు

ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించిన ఎంపీ నామ నాగేశ్వరరావుకు మాదిగ దండోరా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపీ నామను మాదిగ ఎంపీ నామకు కృతజ్ఞతలుహక్కుల దండోరా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ శ్యామల మాదిగ, ఉమ్మడి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్‌కుమార్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కనకపుడి వీరస్వామిమాదిగ, సగ్గుర్తి కోటేశ్వరరావు మాదిగ, కాంపల్లి గోపాలరావు మాదిగతో పాటు జెర్రిపోతుల నరేష్‌మాదిగ, భాస్కర్ మాదిగ విజయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పక్కాగా పాటించాలి



నేలకొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వజ్జా రమ్య

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: ఈ నెల 18న తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో విధ్యులు నిర్వర్తించే వారు సమయపాలన పక్కాగా పాటించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య తెలిపారు. శుక్రవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్, నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. కంటి వెలుగును ప్రజలంతా వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనులు నిర్వర్తించి విజయవంతం చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, డీఎంసీ సుజాత, నేలకొండపల్లిలో జరిగి న సమావేశంలో కంటి వెలుగు మండల స్పెషల్ ఆఫీసర్ కొండపల్లి శ్రీరామ్, తహసీల్దార్ దారాప్రసాద్, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, వైద్యాధికారి గీత తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. సంఘం నాయకులు గోపిచంద్, నాగేశ్వరరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ క్యాలెండర్..
ఖమ్మంగాంధీచౌక్: టీఎన్జీవోస్ యూనియన్ అనుబంధ మహిళా శిశు సంక్షేమ శాఖ ఫోరమ్ క్యాలెండర్లను శుక్రవారం స్థానిక గట్టయ్య సెంటర్‌లోని రోటరీక్లబ్‌లో యూనియన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్, జిల్లా సంక్షేమాధికారి సీహెచ్.సంధ్యారాణి, సంఘ ప్రతినిధులు నందగిరి శ్రీను, బాగం పవన్, బుద్దా రామకృష్ణ, వీర నారాయణ, ఫిరంగి శ్రీను, వై.శ్రీనివాసరావు, కత్తుల రవి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతి పత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఖమ్మంరూరల్: దళితవాడల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బారుగూడెం, నాయుడుపేట, జలగంనగర్‌లలో సర్వే జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేటలో 2008లో అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిందని, వారికి ఇంత వరకు స్థలాలు చూపించకపోవడంతో ఉండటానికి నివాసం లేక అద్దె ఇళ్లల్లో ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. పోలేపల్లి, బారుగూడెం, ఎంవెంకటాయపాలెం, కాచిరాజుగూడెంలలో గత 30 ఏళ్ల క్రితం నిర్మించి ఇచ్చిన పెంకుటిళ్లు శిథిలావస్థకు చేరాయని వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ టి.సుమకు అందించారు. నాయకులు పుల్లారావు, సారయ్య, రామనాథం, వెంకన్న, రామలింగయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్ సరికాదు

ఖమ్మం సహకారనగర్: ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులను తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఉపాధ్యాయులను ముందస్తు అరెస్ట్ చేయటం సరికాదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్, నాయకులు మనోహర్‌రాజు, కె.వెంకటేశ్వర్లు, ముత్తయ్య పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి షురూ..



కూసుమంచి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రైవేట్ విద్యాలయాలతో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాలయాల్లో బోగి పండ్లు చిన్నారులపై పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్